క్లుప్తంగా

పాఠశాల భూమిని కాపాడాలి


వినతిపత్రం ఇస్తున్న ఏబీవీపీ నాయకులు

పెద్దపల్లిరూరల్: పట్టణంలోని అమర్‌నగర్‌లోని జెడ్పీ బాలుర పాఠశాల భూమిని కబ్జా చేసేందుకు యత్నిస్తున్న వాచ్‌మెన్‌పై చర్యలు తీసుకుని భూమిని కాపాడాలని ఏబీవీపీ నాయకులు బండి రాజశేఖర్, కీసరి మనీషా, బల్ల అనిల్ కోరారు. ఈ మేరకు శనివారం డీఈవో ఆఫీస్‌లో సూపరింటెండెంట్‌కు వినతిపత్రం అందించారు. పాఠశాల ఆవరణలో ఓ గదిని తాత్కాలిక అవసరాలకు ఇవ్వగా, వాచ్‌మెన్ అందులో కుటుంబసభ్యులతో నివాసముంటున్నాడని ఆరోపించారు. మన ఊరు మనబడి కార్యక్రమంలో అభివృద్ధి పనులు చేసేందుకు యత్నిస్తే వాచ్‌మెన్ అడ్డుకుంటున్నాడని పేర్కొన్నారు. ఈ వ్యవహారంపై విచారణ జరిపించి సదరు వాచ్‌మెన్‌పై చర్యలు తీసుకోవాలని కోరారు.

చెక్‌డ్యాం నిర్మాణ పనులకు భూమిపూజ


చెక్‌డ్యాం పనులకు భూమిపూజ చేస్తున్న జీఎం

రామగిరి: సింగరేణి సంస్థ ఆర్జీ3, ఏపీఏ పరిధిలోని సెంటినరీకాలనీలోని జోన్-3, కమాన్‌పూర్ మండలం జూలపల్లి పంచాయతీ పరిధి ముల్కలపల్లి మధ్య బొక్కలవాగుపై చెక్ డ్యాం నిర్మాణానికి శనివారం ఆర్జీ- 3 ఎస్ఓటూ జీఎం జి.రఘుపతి భూమిపూజ చేశారు. సింగరేణి సంస్థ ఆర్జీ-3 పరిధి ఓసీపీ1 విస్తరణ రెమిడీయేషన్ ప్లాన్‌లో భాగంగా రూ.23 లక్షల వ్యయంతో చెక్ డ్యాం నిర్మిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సివిల్ ఎస్ఈ పద్మరాజు, ఓసీపీ1 ఎస్ఈ కిషన్, డీవైఎస్ఈ రామకృష్ణ, డీవైపీఎం కావూరి మారుతి తదితరులు పాల్గొన్నారు.

పట్టణాన్ని పారిశుధ్యంగా తీర్చిదిద్దుదాం

సుల్తానాబాద్: పట్టణాన్ని పారిశుధ్యంగా తీర్చిదిద్దేందుకు ప్రజలు సహకరించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ ముత్యం సునీత అన్నారు. శనివారం ఆటో ట్రాలీలో పలు కాలనీలలో ఫాగింగ్ యంత్రంతో స్ప్రే చేశారు. పారిశుధ్య కార్మికులు వచ్చినప్పుడు వ్యర్థాలను ట్రాలీలో వేయాలన్నారు. వ్యర్థాలను బయట వేస్తే దోమలు తయారై రకాల రోగాలు వస్తాయని వివరించారు. డెంగీ, మలేరియా ఇతర వ్యాధులు వ్యాప్తి చెందకుండా పారిశుద్ధ్యం పట్ల ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలన్నారు.

సీసీరోడ్డు పనులు ప్రారంభం


సీసీరోడ్డు పనులు ప్రారంభిస్తున్న ఎంపీపీ

కమాన్‌పూర్: మండల కేంద్రంలోని బాపూజీ నగర్‌లో రూ.5 లక్షలతో చేపడుతున్న సీసీ రోడ్డు నిర్మాణపనులను శనివారం ఎంపీపీ రాచకొండ లక్ష్మి ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ నీలం సరిత, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పిన్‌రెడ్డి కిషన్ రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గుర్రం లక్ష్మీమల్లు, ఎంపీటీసీ కోలేటి చంద్రశేఖర్, ఉపసర్పంచ్ బొజ్జ రాజసాగర్, నాయకులు గసిగంటి అజయ్, రాచకొండ రవి, పాల్గొన్నారు.

ప్రజాసంక్షేమంపై పట్టింపేదీ..?

పెద్దపల్లిరూరల్: ప్రజాసంక్షేమాన్ని పక్కకు బెట్టి కేంద్రంలోని బీజేపీపై విమర్శలు చేయడమే పనిగా పెట్టుకున్నారని బీజేపీ నాయకుడు గొట్టిముక్కుల సురేశ్‌రెడ్డి అన్నారు. పెద్దపల్లిలో శనివారం మాట్లాడారు. అంతర్జాతీయ మార్కెట్ ధరలను బట్టి గ్యాస్, ఇంధన ధరల్లో హెచ్చు తగ్గులుంటాయనే విషయం బీఆర్ఎస్ పాలకులకు, కాంగ్రెస్ నాయకులకు తెలియదా అని ప్రశ్నించారు. వరుసగా రెండుసార్లు అధికారం అప్పగించిన ప్రజలపై విద్యుత్, ఆర్టీసీ ఛార్జీల భారాన్ని మోపారని ఆరోపించారు. విద్యుత్ ఛార్జీల పెంచడంతో పాటు, ఏసీడీ పేరిట వసూళ్లకు తెరలేపారని విమర్శించారు. ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ మమతారెడ్డి పెద్దపల్లి ప్రజలు, వ్యాపారులపై పన్నుల భారాన్ని ఎందుకు మోపారో తెలపాలని డిమాండ్ చేశారు. అధికారంలో ఉండి పన్నులను మీరే పెంచి మీరే రోడ్లపైకి వచ్చి ఆందోళనలకు దిగడం విడ్డూరంగా ఉందన్నారు. సమావేశంలో నాయకులు కట్కూరి సత్యనారాయణరెడ్డి, కరుణాకర్, శేఖర్‌గౌడ్, వైద తిరుపతి, తదితరులున్నారు.

సండే స్పెషల్


గురుకుల విద్యాలయంలో విద్యార్థులకు శిక్షణ ఇస్తున్న సురేశ్

మొక్కవోని ధైర్యం.. నిండైన ఆత్మవిశ్వాసం

ఇరవై ఏళ్ల కఠోర సాధనతో నేడు అందుతున్న ఫలాలు

- 2002లో స్పార్క్ కుంగ్ ఫూ కరాటే శిక్షణ కేంద్రం
- ప్రతిభ చాటుతున్న విద్యార్థులు

రామగుండం: మానసిక ధైర్యం... అన్నింటికీ బలమైన మందు అనేది ప్రతీ ఒక్కరికి తెలిసిందే. ప్రమాదంలో గాయపడినా... ఆత్మవిశ్వాసంతో కరాటే నేర్చుకుని ఎంతోమంది విద్యార్థులకు శిక్షణ ఇస్తూ ఆదర్శంగా నిలుస్తున్నాడు.. ఇరవై ఏళ్ల క్రితం స్థాపించిన స్పార్క్ కుంగ్‌ఫూ కరాటే శిక్షణ కేంద్రంతో తాను కష్టపడిన తీరుతో నేడు సత్ఫలితాలను చూస్తున్నాడు. ఫలితంగా సమాజంలో తనకంటూ ప్రత్యేక గౌరవం, గుర్తింపు పొందుతున్నాడు. ఎంతోమంది పోలీసు ఉన్నతాధికారులు, మెడల్స్ పొందిన కరాటే విద్యార్థుల తల్లిదండ్రుల ప్రేమను చూరగొంటున్నాడు. అతడే కుంగ్‌ఫూ కరాటే శిక్షణ కేంద్రం నిర్వాహకుడు వడ్డెపల్లి సురేశ్.


సురేశ్ శిక్షణలో పతకాలు సాధించిన విద్యార్థులు

సోదరుడి స్ఫూర్తితో..

వడ్డెపల్లి సురేశ్ సోదరుడు శ్రీనివాస్ 25 ఏళ్ల క్రితం స్థానికంగా ఉన్న సీనియర్ కరాటే మాస్టర్ మునీర్ అలీ వద్ద శిక్షణ పొందాడు. తన సోదరుడు శ్రీనివాస్ కరాటే సాధనకు వెళ్తుండగా, తనలోనూ నేర్చుకోవాలనే తపన పెరిగింది. భవనం పై నుంచి ప్రమాదవశాత్తు పడడంతో వెన్నుముకకు గాయమైంది. దీంతో బెడ్‌రెస్ట్ అవసరమని, కరాటే నేర్చుకుంటే ప్రమాదమని వైద్యులు తెలిపారు. తనలోని తపనను గుర్తించిన తల్లిదండ్రులు కరాటే శిక్షణకు ప్రోత్సహించారు. శిక్షణ అనంతరం అంచెలంచెలుగా ఎదుగుతూ స్పార్క్ కుంగ్‌ఫూ కరాటే శిక్షణ కేంద్రం ఏర్పాటు చేశారు. తనకు తెలిసిన విద్యను కస్తూర్బా, గురుకుల, ప్రభుత్వ పాఠశాలల్లోని ఎందరో విద్యార్థులకు నేర్పారు. ఇలా శిక్షణ పొందిన విద్యార్థులు నేడు వివిధ వేదికల్లో ప్రతిభ చూపుతుండడం తనకు ఎంతో ఆనందాన్నిస్తుందని సురేశ్ చెబుతుంటారు. ప్రస్తుతం విక్టరీ షోటోకాన్ కరాటే అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా కొనసాగుతున్నారు.

సురేశ్ సాధించిన విజయాలు

- 2008 సెప్టెంబర్ కరీంనగర్‌లో రాష్ట్ర స్థాయి పోటీల్లో ఆరు ప్రథమ, 2 ద్వితీయ, 2 గ్రాండ్ ఛాంపియన్‌షిప్‌లు...
- 2009 ఫిబ్రవరిలో బెల్లంపల్లిలో జాతీయ స్థాయిలో పోటీల్లో 10 ప్రథమ, 4 ద్వితీయ, 2 గ్రాండ్ ఛాంపియన్‌షిప్స్
- 2009 జూలై ఖమ్మంలో జరిగిన జాతీయ స్థాయి పోటీల్లో 19 మంది విద్యార్థులు వివిధ స్థాయిల్లో బహుమతులు సాధించారు. జాతీయ, రాష్ట్ర స్థాయిలో ఎక్కడ పోటీలు జరిగినా సురేశ్ వద్ద శిక్షణ పొందిన విద్యార్థులు తప్పకుండా బహుమతులు సాధిస్తున్నారు.

కరాటేతో నిరుపేద విద్యార్థుల జీవితాల్లో వెలుగులు



నేను ఇచ్చిన కరాటే శిక్షణ ఎంతోమంది నిరుపేద విద్యార్థుల్లో వెలుగులు నింపింది. ఇప్పటికీ రెండు వేల మందికి పోలీస్, ఆర్మీ, బాలికలకు ఆత్మరక్షణకు సంబంధించిన శిక్షణ ఇచ్చాను. అప్పటి జిల్లా కలెక్టర్ దేవసేన, ఇతర పోలీసు ఉన్నతాధికారులు ఎంతో సహకరించారు. ప్రస్తుతం ఎక్కడ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు శిక్షణ ఇవ్వాలన్నా నా పేరు గుర్తుకు రావడం ఎంతో ఆనందాన్ని కలిగిస్తోంది.

– వడ్డెపల్లి సురేశ్, కరాటే మాస్టర్, రామగుండం

ప్రజల గుండెల్లో గులాబీ జెండా

- ఎమ్మెల్యే కోరుకంటి చందర్


అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే

జ్యోతినగర్: తెలంగాణ ప్రజల గుండెల్లో గులాబీ జెండా ఉందని, రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్న మహానేత ముఖ్యమంత్రి కేసీఆర్ అని రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ అన్నారు. శనివారం రామగుండం కార్పొరేషన్ నాలుగో డివిజన్ సింధూర కళాశాల రోడ్డు వద్ద రూ.80 లక్షల నిధులతో చేపట్టనున్న సీసీరోడ్డు పనులకు మేయర్ బంగి అనిల్‌కుమార్, డిప్యూటీ మేయర్ నడిపెల్లి అభిషేక్‌రావు, కమిషనర్ సుమన్‌రావులతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రం ఏర్పడిన తర్వాత సీఎం కేసీఆర్ నేతృత్వంలో ప్రతి పల్లె, పట్టణం అభివృద్ధి చెందుతుందన్నారు. అభివృద్ధికి కేరాఫ్‌గా రామగుండంను రోల్ మోడల్‌గా తీసుకువచ్చేందుకు నిరంతరం శ్రమిస్తున్నట్లు తెలిపారు. ప్రతిపక్ష పార్టీల నాయకులు ఎంత దుష్ప్రచారం చేసినా.. ప్రజలు వాటిని నమ్మరని, భవిష్యత్తులో ప్రజలే వారికి తగిన బుద్ధి చెబుతారన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు దాతు శ్రీనివాస్, కల్వచర్ల కృష్ణవేణి, కో–ఆప్షన్ సభ్యులు శ్రీనివాస్ గౌడ్, నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులు సత్ప్రవర్తనతో సమాజంలో గుర్తింపు పొందాలి

విద్యార్థుల సత్ప్రవర్తనతో సమాజంలో తగిన గుర్తింపు లభిస్తుందని రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ అన్నారు. శనివారం ఎన్టీపీసీ రామగుండంలోని తిరుమల వెంకన్న గార్డెన్స్‌లో విశ్వభారతి హైస్కూల్ 30 ఏళ్ల వార్షికోత్సవ వేడుకలను ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులు ఉన్నతంగా ఎదిగి, ఉన్న ఊరుకు కన్నవారికి పేరు తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో నగర మేయర్ బంగి అనిల్ కుమార్, డిప్యూటీ మేయర్ నడిపెల్లి అభిషేక్ రావు, ఎంఈవో లక్ష్మి, కార్పొరేటర్లు పాఠశాల కరస్పాండెంట్ బందారపు యాదగిరి గౌడ్, విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

పిల్లల భవిష్యత్‌కు గురువులే మార్గదర్శకులు

గోదావరిఖనిటౌన్: పిల్లల బంగారు భవిష్యత్‌కు గురువులే మార్గదర్శకులని ఎమ్మెల్యే కోరుకంటి చందర్ అన్నారు. శనివారం స్థానిక ఎస్వీ ఫంక్షన్‌హాల్‌లో ఏర్పాటు చేసిన ఆపిల్ కిడ్స్ స్కూల్ గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పిల్లలు సత్ప్రవర్తనతో మెలిగి, విద్యాబుద్ధులు అలవర్చుకుని సమాజంలో పేరు ప్రతిష్టలు సంపాదించుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు బాలరాజ్‌కుమార్, మేకల సదానందం యాదవ్, బీఆర్ఎస్ నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పేదింటి ఆడబిడ్డలకు వరం కల్యాణలక్ష్మి

పాలకుర్తి: కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలు పేదింటి ఆడపిల్లలకు గొప్ప వరమని ఎమ్మెల్యే కోరుకంటి చందర్ అన్నారు. శనివారం మండలంలోని గ్రామాల్లో కల్యాణలక్ష్మి లబ్ధిదారులకు మంజూరైన చెక్కులను వారి ఇళ్లకు వెళ్లి అందజేశారు. కార్యక్రమంలో మండల వైస్ ఎంపీపీ ఎర్రం స్వామి, మండల తహసీల్దార్ సునీత, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, టీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

దైవ చింతనతో మానసిక ప్రశాంతత

జూలపల్లి: దైవ చింతనతో మానసిక ప్రశాంతత వస్తుందని పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని కుమ్మరికుంటలో వేద పండితుల మంత్రోచ్ఛారణల మధ్య రామాలయ నిర్మాణానికి ఎమ్మెల్యే భూమిపూజ చేశారు. అనంతరం మాట్లాడుతూ ఆలయ నిర్మాణంలో తనవంతు సహకారం ఉంటుందని పనులు త్వరగా ప్రారంభించాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ మేచినేని సంతోశ్‌రావు,ఎంపీటీసీ తమ్మడవేని మల్లేశ్ యాదవ్, నాయకులు పాల్గొన్నారు.

బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా వింజమూరి సురేశ్

గోదావరిఖనిటౌన్: బీసీ సంక్షేమ సంఘం రామగుండం నియోజకవర్గ అధ్యక్షుడిగా వింజమూరి సురేశ్‌ను నియమించినట్లు జిల్లా అధ్యక్షుడు తాడూరి శ్రీమన్నారాయణ తెలిపారు. సంఘం బలోపేతానికి కృషి చేస్తానని, బహుజనుల సమస్యలపై పోరాటం చేస్తానని సురేశ్ తెలిపారు. తన నియామకానికి సహకరించిన బీసీ సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్యకు, జిల్లా అధ్యక్షుడు తాడూరి శ్రీమన్నారాయణకు ఈ సందర్భంగా ఆయన కృతజ్ఞతలు తెలిపాడు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పొన్నం ప్రసాద్‌గౌడ్, జిల్లా మహిళా ప్రధాన కార్యదర్శి బొద్దుల అరుణ, నాయకులు పాల్గొన్నారు.

కో ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ డైరెక్టర్‌గా లత

పెద్దపల్లిరూరల్: మున్నూరుకాపు మహిళా పరస్పర సహకార పొదుపు, పరపతి సంఘం లిమిటెడ్ డైరెక్టర్‌గా పెద్దపల్లికి చెందిన తూముల లతను నియమించినట్లు చైర్మన్ ఎటిగడ్డ అరుణ తెలిపారు. ఈ మేరకు నియామకపత్రాన్ని అందజేశారు. సభ్యుల సంక్షేమానికి, సంఘం అభివృద్ధికి పాటుపడతానని లత పేర్కొన్నారు.

మత్స్య పారిశ్రామిక సహకార సంఘం నూతన కార్యవర్గం

కమాన్‌పూర్: మండలంలోని గుండారం మత్స్య పారిశ్రామిక సహకార సంఘం నూతన కార్యవర్గాన్ని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానిక పెద్దమ్మ ఆలయ ఆవరణలో నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కందుల ఓదెలు, ఉపాధ్యక్షుడిగా ఆకుల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా రాచకొండ రమేశ్, డైరెక్టర్లుగా రాసకొండ లింగయ్య, గరిగంటి మల్లేశ్, పిడుగు సదయ్య, జంగిలి గట్టయ్య, గరిగంటి రమేశ్, మోతే రాజయ్య ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

సంక్షిప్త వార్తలు

సాగునీరు విడుదల

కమాన్‌పూర్: ఎస్సారెస్పీ 31 ఎల్ కాలువ ద్వారా శనివారం రైతులు సాగునీటిని విడుదల చేశారు. ఎస్సారెస్పీ కాలువతో మంథని ప్రాంతానికి వారబంది ప్రకారం సాగు నీటిని విడుదల చేయగా, 31 ఎల్ కాలువను పూర్తిగా మూసివేయడంతో ఈ విషయాన్ని కాంగ్రెస్ కిసాన్ సెల్ జిల్లా కన్వీనర్ వైనాల రాజు ఇరిగేషన్ ఈఈఈ బలరామయ్యకు ఫోన్‌లో వివరించారు. బలరామయ్య ఆదేశాల మేరకు మూసివేసిన కాలువను తెరిచి కమాన్‌పూర్, ములకలపల్లి, జూలపల్లి గ్రామాలకు సాగునీటిని విడుదల చేశారు. కార్యక్రమంలో జూలపల్లి ఎంపీటీసీ శివ శంకరయ్య, రైతులు నీళ్ల రంగయ్య, ఎండీ తాజుద్దీన్, రామకృష్ణ, వెంకటేశ్వర్లు, సుబ్బారెడ్డి, బొజ్జ సతీష్, ఇరిగేషన్ ఏఈఈ ప్రసాద్, వర్క్ ఇన్‌స్పెక్టర్ సదానందం పాల్గొన్నారు.

ఐటీఐలో పీఎంకేవీవై కోర్సు

రామగుండం: స్థానిక ఇండస్ట్రియల్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ (ఐటీఐ)లో ప్రధానమంత్రి కౌశల్ వికాస్ యోజన (పీఎంకేవీవై) పథకంలో రామగుండం ప్రభుత్వ ఐటీఐలో నూతనంగా ప్రవేశపెట్టిన షార్ట్ టర్మ్ కోర్సులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ప్రిన్సిపాల్ ఈసారపు సురేందర్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కోర్సుకు వయో పరిమితి 16 – 45 ఏళ్ల లోపు వారు అర్హులని, ఎలక్ట్రీషియన్, డొమెస్టిక్ డాటా ఎంట్రీ ఆపరేటర్, మ్యానువల్ మెటల్ ఆర్క్ వెల్డింగ్ షీల్డెడ్, ప్లంబర్–జనరల్, ఫోర్ వీలర్ సర్వీస్ టెక్నీషియన్, అసిస్టెంట్ సర్వేయర్ తదితర కోర్సులలో ప్రవేశానికి ఈనెల 31వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపల్ పేర్కొన్నారు.

ప్రైవేట్ హాస్పిటల్‌ను సీజ్ చేయాలి

కోల్‌సిటీ: గోదావరిఖనిలో నిర్లక్ష్యంగా ఆపరేషన్ చేసి, పేషెంట్ కడుపులోనే కత్తెర మర్చిపోయి కుట్లు వేసిన డాక్టర్‌పై కేసులు నమోదు చేసి, సదరు ఆస్పత్రిని సీజ్ చేయాలని ఏఐవైఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం హనుమాన్‌నగర్‌లో ప్రైవేట్ ఆస్పత్రి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మార్కపురి సూర్య మాట్లాడుతూ... ఆరేళ్ల క్రితం కాన్పు కోసం వచ్చిన ఓ గర్భిణికి ఆపరేషన్ చేసి కడుపులోనే కత్తెర మర్చిపోయి కుట్లు వేసిన ఘటనలో సంబంధిత అధికారులు, డీఎంహెచ్‌వో చర్యలు చేపట్టకపోవడం అనుమానాలకు తావిస్తోందన్నారు. డాక్టర్ మెడికల్ కౌన్సిల్ సభ్యత్వం రద్దు చేసి, ప్రాక్టీస్ నుంచి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు వనపాకల విజయ్, నాయకులు అసాల నవీన్, రాణవేని సుధీర్ కుమార్, పాల్గొన్నారు.

వివేక్ చిత్రపటానికి క్షీరాభిషేకం

ఓదెల: ఓదెల రైల్వేస్టేషన్లో రామగిరి, అజ్నీ రైళ్ల హాల్టింగ్ కోసం కృషి చేసిన పెద్దపల్లి మాజీ ఎంపీ వివేక్ చిత్రపటానికి మండల కేంద్రంలో గ్రామస్తులు, బీజేపీ నాయకులు శనివారం క్షీరాభిషేకం చేశారు. అనంతరం స్వీట్లు పంపిణీ చేశారు.కార్యక్రమంలో నాయకులు అల్లం సతీశ్, తీర్థాల కుమార్, మాటూరి రవి, గుర్రాల శ్రీధర్, రాంనేని రాజేంద్రప్రసాద్, మేర్గు సారంగం, తదితరులు పాల్గొన్నారు.

పదో తరగతి విద్యార్థులకు అవగాహన సదస్సు

రామగుండం: అంతర్గాం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో శనివారం పొట్యాల, అంతర్గాం హైస్కూల్ విద్యార్థులకు సైకాలజిస్టులు మోటివేషన్ తరగతులు నిర్వహించారు. రాబోయే పదో తరగతి పరీక్షల్లో పాటించాల్సిన మెలకువలు, ఏకాగ్రత, భయాన్ని తొలగించుకోవడం, పరీక్షపై మానసిక దృఢత్వాన్ని పొందడం తదితర పద్ధతులను పాటించి ఏ విధంగా అత్యధిక మార్కులను సాధించుకోవాలనే అంశాలపై వంద మంది విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెచ్ఎంలు ఇరుగురాల ఓదెలు, వెంకటరమణ, సైకాలజిస్టులు రామస్వామి, మహేందర్‌రెడ్డి, ఆగయ్య తదితరులున్నారు.

కమనీయం.. శివపార్వతుల కల్యాణం


కల్యాణంలో పాల్గొన్న భక్తులు

కాల్వశ్రీరాంపూర్: మండలంలోని మల్యాల విశ్వేశ్వరాలయంలో వార్షికోత్సవం సందర్భంగా శనివారం శివపార్వతుల కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆలయ నిర్మాణ దాతలు ఎన్ఆర్ఐ ఆకినపల్లి చంద్రశేఖర్ దంపతులు, స్వామి వారికి పట్టువస్త్రాలు సమర్పించారు. అలుగువెల్లి విజయ రాజిరెడ్డి, బూషి మంజుల సదాశివరెడ్డి, కాసర్ల మణెమ్మ మల్లారెడ్డి దంపతులు రూ.లక్ష చొప్పున విరాళం, పుస్తె మట్టెలు, తలంబ్రాలు అందించారు. వేద పండితులు వైభవంగా స్వామివారి కల్యాణం జరిపించారు. అనంతరం దాతలను ఆలయ కమిటీ సభ్యులు సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచ్ లంక రాజేశ్వరి సదయ్య, ఎంపీటీసీ గడ్డం రాంచంద్రం, భక్తులు పాల్గొన్నారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు

సుల్తానాబాద్: పట్టణంలోని వేణుగోపాలస్వామి ఆలయ వార్షికోత్సవంలో భాగంగా శనివారం ముగింపు ఉత్సవాలు నిర్వహించారు. వేణుగోపాల స్వామి రుక్మిణి సత్యభామకు నాగవెల్లి నిర్వహించారు. హోమం నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ అల్లంకి సత్యనారాయణ, వేణుగోపాలస్వామి ఆలయ చైర్మన్ పల్లా మురళీధర్ సభ్యులు మున్సిపల్ చైర్ పర్సన్ ముత్యం సునీత, వైస్ చైర్మన్ బిరుదు సమత, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు నగునూరి అశోక్ పాల్గొన్నారు.

ఘనంగా ఉరుసు ఉత్సవాలు

యైటింక్లయిన్‌కాలనీ: యైటింక్లయిన్‌కాలనీ అల్లూరు దర్గాలో శనివారం రాత్రి ఉరుసు ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా దర్గాను అందంగా ముస్తాబు చేసి పూలతో అలకరించారు. కార్యక్రమంలో దర్గా నిర్వాహకులు సయ్యద్ అఖీల్ బాబా, నాయిమ్ బాబా భక్తులు పాల్గొన్నారు.

గ్యాస్ ధర పెంపుతో సామాన్యులపై భారం



నిరసన వ్యక్తం చేస్తున్న మహిళలు

ధర్మారం: కేంద్ర ప్రభుత్వం గ్యాస్ ధరలను పెంచి సామాన్య ప్రజలపై పెను భారం మోపిందని వైఎస్సార్ టీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ నగేశ్ అన్నారు. ధర్మారంలో శనివారం మాట్లాడుతూ వంట గ్యాస్‌పై ఉన్న సబ్సిడీని బీజేపీ ప్రభుత్వం ఎత్తివేసి మహిళలకు ద్రోహం చేసిందన్నారు. గ్యాస్ కనెక్షన్లను కేటాయిస్తూనే మరో వైపు ధరలు పెంచడం అన్యాయమన్నారు. పెంచిన ధరలతో సామాన్యులకు రూ. 50 కోట్ల ఆర్థిక భారం పడుతోందన్నారు. పెంచిన గ్యాస్ సిలిండర్ ధరలను వెంటనే తగ్గించి గ్యాస్‌పై సబ్సిడీని కొనసాగించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సంపత్, రాజు పాల్గొన్నారు.

వంట గ్యాస్ పెంపుపై నిరసన

రామగుండం: కేంద్రం అనుసరిస్తున్న ఆర్థిక విధానాలు సామాన్యుడి పాలిట శాపంగా మారుతున్నాయని ప్రగతిశీల మహిళా సంఘం(పీవోడబ్ల్యూ) జిల్లా అధ్యక్షురాలు కె.జ్యోతి ఆరోపించారు. ఈ మేరకు శనివారం అంతర్గాం మండలంలోని పెద్దంపేట, సుభాష్‌నగర్‌లలో గ్యాస్ సిలిండర్‌తో నిరసన తెలిపారు. మోడీ ప్రభుత్వం రోజు రోజుకు వంట గ్యాస్, పెట్రో ధరలను పెంచుతూ సామాన్యుల నడ్డి విరుస్తుందన్నారు. దేశ భక్తి ముసుగులో పేద, మధ్య తరగతి ప్రజలను ఆర్థిక ఇబ్బందుల్లోకి నెట్టుతుందన్నారు. కార్యక్రమంలో పీవోడబ్ల్యూ ప్రతినిధులు చంద్రమ్మ, రజిత, లావణ్య, గౌతమి, రాధ, లక్ష్మి, శంకరమ్మ, దేవమ్మ, తదితరులున్నారు.

'దోపిడీ పాలనకు వ్యతిరేకంగా ఉద్యమించాలి'

గోదావరిఖని: కేంద్రంలోని అవినీతి దోపిడీ పాలనకు వ్యతిరేకంగా ప్రజలు ఉద్యమించాలని సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా నాయకులు జూపాక శ్రీనివాస్, తోకల రమేశ్, గుమ్మడి వెంకన్న కోరారు. శనివారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడారు. రాయల సుభాష్ చంద్రబోస్ (రవన్న) 7వ వర్ధంతి సందర్భంగా మార్చి 10న హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సభ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అన్ని వర్గాల ప్రజలు హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఓసీపీల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వకుండా శ్రమదోపిడీ చేస్తున్నారన్నారు. సమావేశంలో నాయకులు బి.ప్రసన్నకుమార్, ఇనుగాల రాజేశ్వర్ పాల్గొన్నారు.

నేర ప్రవృత్తి మార్చుకోకుంటే పీడీయాక్ట్


రివార్డులు అందిస్తున్న ఏసీపీ

గోదావరిఖని: రౌడీషీటర్లు నేర ప్రవర్తన మార్చుకోకుంటే పీడీ యాక్టు నమోదు చేస్తామని గోదావరిఖని ఏసీపీ గిరిప్రసాద్ హెచ్చరించారు. శనివారం రౌడీషీటర్లకు గోదావరిఖని వన్‌టౌన్‌లో కౌన్సెలింగ్ ఇచ్చారు. వివిధ కేసుల్లో నిందితులుగా ఉన్నవారు సత్ప్రవర్తనతో జీవించాలన్నారు. శాంతి భద్రతలు, ప్రజల స్వేచ్ఛ హక్కులకు భంగం కలిగిస్తూ వారిపై దాడులకు పాల్పడితే సహించేది లేదన్నారు. బైండోవర్ కాలంలో నేరానికి పాల్పడితే జరిమానాతోపాటు జైలు శిక్ష విధిస్తామన్నారు. అనంతరం రౌడీషీటర్లను రామగుండం తహసీల్దార్ ముందు బైండోవర్ చేశారు. సీఐ రమేశ్‌బాబు, ఎస్సై స్వామి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు. ముందుకు వరకట్నం కేసులో నిందితునికి జైలు శిక్ష పడేలా కృషి చేసిన వన్‌టౌన్ కానిస్టేబుళ్లను ఏసీపీ అభినందించారు.

నేటి నుంచి మల్లిఖార్జున స్వామి జాతర


ఊరేగింపుగా వస్తున్న పూజారులుఊ

రామగుండం: అంతర్గాం మండల పరిధిలోని ముర్మూర్ గ్రామ శివారులో ప్రతీ ఏటా నిర్వహించే గోపు కొమురన్న జాతర, శ్రీమల్లిఖార్జున కల్యాణోత్సవ వేడుకలకు ఇతర ప్రాంతాల నుంచి వేలాదిగా భక్తులు తరలివస్తారు. ఈ నేపథ్యంలో జాతర నిర్వహణకు ఆలయాన్ని ముస్తాబు చేశారు. ఆది, సోమవారాల్లో నిర్వహించే జాతరలో భాగంగా తొలిరోజు దిష్టికుంభం, మైలలుతీయుట, రుద్రాభిషేకం, బియ్యం, సుంకు పెద్దపట్నం అనంతరం స్వామివారి కల్యాణోత్సవం నిర్వహించనున్నారు. రెండో రోజు వేకువజామున అగ్నిగుండ ప్రవేశంతో జాతరకు ముగింపు పలుకనున్నారు. జాతర కమిటీ చైర్మన్ గోపు అయిలయ్యయాదవ్ నేతృత్వంలో ఆలయ ప్రాంగణంలో తాగునీరు, చలువ పందిళ్లు, పారిశుద్ధ్య నిర్వహణ తదితర ఏర్పాట్లు ముమ్మరంగా జరుగుతున్నాయి.